# ఎత్తుకు పై ఎత్తు

శ్రీమతి పి. జె. శాంతమ్మ

అంతవరకు ప్రక్క ఇంటిలో పస్తులతో చస్తున్నా చిట్టెమ్మను ఒక్కనాడూ పలుకరించలేదు రామారావు. ఆ వేళ "ఏం చిట్టమ్మా! బాగున్నావా? ఏంటి కథ" అన్నాడు. పాపం మొన్ననే మశూచికం పోసి కంటిలో పువ్వు వేసిందికదూ ఒక్కటేదారి చూపుతుంది. ఆ కంటితో వడవడ వణికే కంఠంతో "ఎవరు బాబూ!" అంది గుండెమీదఉన్న పీలిక సరుదుకొంటూ! "నేను రామారావును." "తమరా! బాబూ!" అంది ముడుతలుబడిన బొక్కినోరువిప్పి. "ఆ! నేనే! నీ వెలాఉన్నావో ఒకమారుచూచి పోదామని ఇలావచ్చా" "అయ్యో! ఎంత దయబాబూ! ఈ దీనురాలిమీద." "సరే వస్తా!" "చిత్తం." "ఏమైన కొనుక్కు తినుఅంటూ 5 వెండిరూపాయిలు ముసలి చేతిలోపడేలావిసిరి" వెళ్ళిపోయాడు. "ఏమిటి? అమ్మో! వెండిరూపాయిలే! లక్ష్మి వచ్చింది మా యింటికి" అనుకొంటూ "ఆవేళ మా ముసలతన్ని మెడబట్టి గెంటేసినప్పుడు బోర్లపడితే ముక్కు, మూతి చితికిపోయిందే, అలా తీసుకొనే చచ్చిపోయేడే. ఇది అన్యాయమని అడిగానని ఆ వెంటనే నన్నుపని మాన్పించేసాడే ఇంతకు మేముచేసిన నేరం! జామచెట్టెక్కి పండుకొయ్యలేక పోయాడు. కుర్రాడు ఏడ్చాడు. తనకూడుతింటూ తనబిడ్డకోర్కె తీర్చలేకపోయాడనేగా? ఆ ముసలాడు చెట్టెక్కితే కాళ్లువణికిపడిపోతానని భయపడ్డాడు. అంత కఠినహృదయుడు – ఈ వేళ, ఏమబ్బా! ఒకవేళ పాతనేరానికి పశ్చాత్తాపంకలిగిందేమో?" అనుకొంటూ బుట్ట చంకబెట్టుకొని తడకజారేసి బజారుకు పోయింది చిట్టెమ్మ.

ఒకప్పుడు బాగానే బ్రతికింది. అన్నీ హారతైపోయాక, రామారావుగారింట్లో భార్యాభర్తలు నౌఖరికి కుదిరారు. ముసలాయన పెద్దపిల్లల్ని ఆడించడం, పరుపులు వెయ్యడం, మేడకు కాపుండడం. చిట్టెమ్మకు వంటపని. మరి ఆ నౌఖరిపోవడం, ముసలాయన చావడం, ఏదో చాటుగా కూలి చేసుకొని ఉన్నరోజు తినడం, లేనిరోజు పస్తుండడం. అలా పడిఉండడం. ఈ వేళ జరిగిన కథ ఇది.

ఏవేవో కొనుక్కొని వచ్చింది ఇంటికి. ఇంటిముందు సుబ్బయ్యశెట్టిగారు మరెవరో ఇద్దరు నిలబడి ఉన్నారు. "ఏమమ్మా! బాగున్నావా?" అని పలుకరించాడు సుబ్బయ్యశెట్టి "ఎవరు బాబూ!" అంటూ ఎండవైపు చేయి చాటుబెట్టుకొని చూస్తూ అంది. "నేనమ్మా శెట్టిని మరి మీరు బాగాఉండేటైములో నా దగ్గిరేగా వెచ్చాలుకొనేవారు. అబ్బ! ఎంతమంచివారండి వీరిభర్త అంతా పోయింది పాపం" అని ప్రక్కనున్నవారితో కనికరం

కారిపోతున్నట్లు చెప్పాడు. "ఏంబాబు ఇలా వచ్చారు" అంది ఆశ్చర్యంగా. "అబ్బే నీవు ఎలా ఉన్నావో చూసిపోదామని బుద్ధి పుట్టింది అలా వచ్చేసా" అన్నాడు శెట్టి. "కూర్చోండిబాబూ" "పరవాలేదు వెళ్ళొస్తా" అంటూ 5 రూ. నోటు ఆమెచేతిలోపెట్టి "పెద్దకాలం ఏదైనకొని నోట్లోవేసుకో" అంటూ వెళ్ళిపోయాడు.

అలా కొయ్యబారి నిలబడిపోయింది. చిట్టెమ్మ బిచ్చానికివెళ్లిన పిడికెడు గింజలు వేయని శెట్టి ఇంటికివచ్చి కుశలప్రశ్నలు అడిగి తనంతటతానే రూపాయలనోటు ఇచ్చిపోవడం ఎవరిని ఆశ్చర్యపరచదు? వెళ్ళి బియ్యం చేటలోపోసిందో లేదో సుందరంగారు వచ్చారు. "చిట్టమ్మా! చిట్టమ్మా!" "ఎవరూ? నా గొంతుపోల్చలేకపోయావ్. నేను సుందరాన్ని" "అయ్యో! ప్రభువులు ఈ పేదరాలి ఇంటికి రావాలా? కాకితో కబురంపితేరానా?" అంది ఆత్రుతగా! "ఆ దానికేం దేశసేవ చేయడానికి పూర్తిగా పూనుకొని ఇక కారెక్కడంకూడా మానుకొని కాలినడకనే వచ్చాను" అన్నాడు ప్రక్కన ఉన్న బారెడు మీసాలాయన. "చిత్తం ప్రభువులు" "మరి అప్పుడప్పుడు ఇంటికిరా- అమ్మగారు నిన్ను చూడాలంటూ ఉన్నారు. మరివస్తా నీవేదో వండుకొంటావు కాబోలు ఇదిగో నీకు" అంటూ రెండురూపాయలు చేతిలోపెట్టి వెళ్లిపోయాడు. ఏమి తోచడంలేదు చిట్టెమ్మకు. ఈవేళ లక్ష్మీదేవికింతదయ ఏలకలిగిందో ఏమిబోధపడలేదు ముచ్చెమటలు పోస్తున్నాయి, గడగడ కాళ్లు వణుకుతున్నాయి, సుమారు పదేళ్లనుండి ఒక్కసారైన ఇలాటి అనుగ్రహంకలగని లక్ష్మికి - ఈ వేళ ఏమబ్బా! అనుకొంటూ మల్లా బియ్యపు చేట పట్టుకొంది. ఏదో పెద్ద ఊరేగింపు పాటలు వస్తున్నాయి ఆ రోడ్డువైపు. జై రామారావుగారికి, జై "నీ ఓటు ఎవరికిస్తావ్" "రామారావుగారికిస్తా" అంటూ ఆకాశాన్నంటే కేకలు తనముందునుంచే. బైటకువచ్చి అంతా చూచింది "ఏమిటిది?" అని అడిగింది ఆ గుంపులో ఒకణ్ణి. "పండుగ" "ఏంపండుగ" "ఓట్ల పండుగ రేపే ఎలక్షన్సు." ఆ! తెలిసింది. లక్ష్మి తన ఇంటికి వచ్చినకారణం మరిముగ్గురు కోరారు నా ఓటు. ఏందారి అంటూ మల్లా చేటబట్టుకొంది. అంతలో "మామ్మా" అంటూ మనవడు ఊర్నుంచి వచ్చాడు. "రా బాబూ!" అంటూ కూర్చోబెట్టి జరిగిన సంగతంతా చెప్పింది. "నీ కెందుకుమామ్మా! నే చెప్పినట్లు నడుచుకో" అన్నాడు గడుసు మనవడు. ఉదయం ఒక సైకిల్ రిక్షా, ఒక మోటారు కారు, ఒక జట్కాబండి చిట్టెమ్మ ఇంటి ముందు ఆగాయి.

లోపల కుక్కిమంచంలో బట్టతో చుట్ట

బడిన చిట్టెమ్మ తలదగ్గర దీపంబెట్టి "మామ్మా! నన్ను వదలిపోయావా! అమ్మపోయింది నువ్వుపోయావా! నాకు దిక్కెవరు మామ్మా! ఓ మామ్మా నీ కోసం కార్లు వచ్చాయి మామ్మా! నువ్వు పూలరథంఎక్కిపోయావా? మామ్మా! అంటున్నాడు తారస్థాయిలో. వచ్చిన వారు పాపం కుర్రాడిని ఓదార్చడానికి టైమేది? వంగి లోపలికి చూడ్డం, వెంటనే పోవడం, వాళ్లకి దేపనేమిటి? ఇంకా ఇలా ఎంతమందిదగ్గరకు పోవాలో!

తెల్లవారి చూచేసరికి చిట్టెమ్మ ఖాళీ గుడిసెమాత్రం కదలక మెదలకఉంది.

